▪ ఈసీ వద్ద ధర్నా చేస్తా



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో ఇతర రాష్ట్రాల ఓటర్లను చేర్చుతున్నారని ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె గురువారం టీఎంసీ సమావేశంలో మాట్లాడుతూ, నకిలీ ఓటర్లను చేర్చడంలో బీజేపీకి ఎన్నికల కమిషన్ సహకరిస్తున్నదని ఆరోపించారు. దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే తాను ఈసీ కార్యాలయం వద్ద నిరవధిక ధర్నా చేస్తానని హెచ్చరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడాన్ని ఆమె ప్రశ్నించారు. రాజ్యాంగ వ్యవస్థ అయిన ఈసీని ప్రభావితం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ ఇటువంటి చిట్కాలను ఢిల్లీ, మహారాష్ట్రలలో కూడా ఉపయోగించిందన్నారు. ఎన్నికలను మాయ చేయడం కోసం హర్యానా, గుజరాత్ రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను చేర్పించి, ఢిల్లీ, మహారాష్ట్రలలో బీజేపీ గెలిచిందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే గెలవలేమని బీజేపీకి తెలుసునన్నారు. అందుకే ఆ పార్టీ హర్యానా, గుజరాత్‌ల నుంచి నకిలీ ఓటర్లను తీసుకొచ్చి, గెలిచేందుకు ప్రయత్నిస్తున్నదని తెలిపారు.

▪ అసెంబ్లీలోకి రానివ్వడం లేదు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ నియంతృత్వానికి సంబంధించిన అన్ని హద్దులను చెరిపేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత, మాజీ ముఖ్యమంత్రి అతిశీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జై భీమ్' నినాదాలు చేసినందుకు తమ పార్టీ ఎమ్మెల్యేలను మంగళవారం నుంచి మూడు రోజులపాటు శాసన సభ నుంచి సస్పెండ్ చేశారని ఆమె ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. గురువారం తమను కనీసం శాసనసభ ప్రాంగణంలోకి ప్రవేశించడానికి సైతం అనుమతించలేదని ఆరోపించారు. ఢిల్లీ శాసన సభ చరిత్రలో ఇటువంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శాసన సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ మినహా మిగిలిన 21 మంది ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ విజేందర్ గుప్తా ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలను సభ నుంచి మూడు రోజులపాటు సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు.

▪ స్థానిక భాషలను మింగేసిన హిందీ

చెన్నై, ఫిబ్రవరి 27: తమ రాష్ట్రంపై హిందీని బలవంతంగా రుద్దడాన్ని సహించబోమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళ భాషను, తమిళ సంస్కృతిని పరిరక్షిస్తానని ఆయన పునరుద్ఘాటించారు. హిందీ విధింపును వ్యతిరేకిస్తామని, హిందీ అనేది ముసుగు మాత్రమేనని, సంస్కృతం దాని వెనుక దాగిన ముఖమని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాసిన లేఖలో ఆరోపించారు. 1965లో డీఎంకే నిర్వహించిన హిందీ వ్యతిరేక ఉద్యమం తరహాలో మరో భాషా యుద్ధానికి సిద్ధమని స్టాలిన్ ఇప్పటికే ప్రకటించారు. బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో మాట్లాడే మైథిలి, బ్రజ్‌భాష, బుందేల్‌ఖండీ, అవధి వంటి అనేక ఉత్తర భారతీయ భాషలను హిందీ నాశనం చేసిందని స్టాలిన్ తన లేఖలో తెలిపారు. భాషల దురాక్రమణ కారణంగా 25కి పైగా ఉత్తర భారతీయ ప్రాంతీయ భాషలు నాశనమయ్యాయని తెలిపారు.

మోదీ డిగ్రీని కోర్టుకు మాత్రమే చూపిస్తాం

ఇతరులకు చూపించబోం

హైకోర్టుకు తెలిపిన ఢిల్లీ విశ్వవిద్యాలయం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ చదివిన డిగ్రీకి సంబంధించిన రికార్డులను న్యాయస్థానానికి చూపిస్తామని ఢిల్లీ హైకోర్టుకు గురువారం ఢిల్లీ విశ్వవిద్యాలయం తెలిపింది. ఆ రికార్డులను ఇతరులకు చూపించబోమని చెప్పింది. దీంతో తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. నీరజ్ అనే వ్యక్తి ఆర్టీఐ చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తుపై కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) 2016 డిసెంబరులో తీర్పు చెప్తూ, 1978లో బీఏ ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులందరి రికార్డులను పరిశీలించేందుకు అవకాశం ఇవ్వాలని డీయూను ఆదేశించింది. ఈ ఆదేశాలను డీయూ హైకోర్టులో సవాల్ చేసింది. హైకోర్టు 2017 జనవరిలో సీఐసీ ఆదేశాలను నిలుపుదల చేసింది.

వక్ఫ్ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

మలివిడత బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్ ముందుకు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: పార్లమెంట్‌లో ఈనెల 13న సంయుక్త పార్లమెంటరీ సంఘం(జేపీసీ) ప్రవేశపెట్టిన వక్ఫ్(సవరణ) బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. ఫిబ్రవరి 19న జరిగిన సమావేశంలో కేంద్ర క్యాబినెట్ బిల్లుకు చేసిన సవరణలను ఆమోదించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్‌లో 2005 వార్షిక బడ్జెట్ సమావేశాల మొదటి భాగం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభలో జేపీసీ నివేదికను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర క్యాబినెట్ గత వారం జేపీసీ నివేదికను ఆమోదించడంతో మార్చి 10 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

పెంపుడు పిల్లులకు బర్డ్ ఫ్లూ

భారత్‌లో తొలిసారి గుర్తింపు

న్యూఢిల్లీ: ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ (హెచ్5ఎన్1) మన దేశంలో మొదటిసారి పెంపుడు పిల్లుల్లో కనిపించింది. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో ఈ కేసులు నమోదవడంతో బర్డ్ ఫ్లూ మానవులకు కూడా సోకుతుందేమోననే ఆందోళన ప్రబలుతున్నది.ఈ వైరస్ సోకిన పిల్లులన్నీ తీవ్ర జ్వరం, ఆకలి కోల్పోవడం, నిద్రమత్తుతో బాధపడినట్లు, నమూనాలను సేకరించిన ఒకటి నుంచి మూడు రోజుల్లోనే ఇవి మరణించినట్లు ఈ అధ్యయనం వెల్లడించింది. మొత్తం మీద ఈ వైరస్ 27 పరివర్తనలను శాస్త్రవేత్తలు గుర్తించారు.

జపాన్‌లో 125 ఏండ్ల కనిష్ఠానికి జననాల రేటు

టోక్యో, ఫిబ్రవరి 27: జపాన్‌లో రికార్డు స్థాయికి జననాల రేటు పడిపోయింది. వరుసగా తొమ్మిదో ఏడాది కూడా తగ్గుదల నమోదైంది. ఒక వైపు పెరుగుతున్న వృద్ధుల సంఖ్య, మరో వైపు తగ్గుతున్న జననాల పట్ల ఆందోళన చెందుతున్న జపాన్ ఎన్నో చర్యలు చేపట్టినా ఫలితాలను ఇవ్వడం లేదు. 2024లో 7,20,998 మంది శిశువులు జన్మించారు. మునుపటి ఏడాదితో పోలిస్తే ఇది 5 శాతం తగ్గుదల అని ఆ దేశ ఆరోగ్య, సంక్షేమ శాఖ ప్రకటించింది. 1899 తర్వాత ఇంత తక్కువగా జననాలు నమోదు కావడం ఇదే తొలిసారని తెలిపింది. గత ఏడాది జపాన్‌లో 4,99,999 పెండ్లిండ్లు నమోదయ్యాయి.ఒక అంచనా ప్రకారం 2070 నాటికి జపాన్ జనాభా 30 శాతం తగ్గుతుంది.

గాజా నుంచి కదిలేది లేదు

- ఇజ్రాయెల్ అధికారి వెల్లడి
- హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇబ్బందులు

ఖాన్ యూనిస్(గాజా స్ట్రిప్): ఇజ్రాయెల్-హమాస్ ఉగ్రవాద సంస్థ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఇబ్బందుల్లో పడే అవకాశం కనిపిస్తున్నది. ఇజ్రాయెలీ అధికారి ఒకరు గురువారం మాట్లాడుతూ, ఫిలడెల్ఫీ కారిడార్‌గా పిలవబడుతున్న ప్రాంతంలో తమ సైన్యం కొనసాగవలసిన అవసరం ఉందన్నారు. ఆయుధాల అక్రమ రవాణాను నిరోధించేందుకు తమ సైన్యాలు ఇక్కడే ఉండాలని చెప్పారు. ఈజిప్టు సరిహద్దుల్లో గాజా వైపు ఈ ప్రాంతం ఉంది. ఈ కారిడార్‌లో బఫర్ జోన్‌ను కొనసాగించేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తే, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లేనని హమాస్ హెచ్చరించింది.

రాష్ట్రాల వాటాలో కోత?

- కేంద్ర పన్నుల్లో వాటా తగ్గించాలని కేంద్రం యోచన
- 41 శాతం నుంచి 40 శాతానికి కుదించే ప్రతిపాదన?
- ఆర్థిక సంఘం ఆమోదం లభిస్తే 2026 నుంచి అమలు
- కేంద్రానికి 35 వేల కోట్ల అదనపు ఆదాయానికి అవకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు దక్కాల్సిన వాటాకు కోత పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నదా? ఈ చర్య ద్వారా ద్రవ్యలోటును పూడ్చుకోవాలని ప్రయత్నిస్తున్నదా? అంటే విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రాలకు పన్ను వాటాను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నదని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటా దక్కుతున్నది. దీనిని ఒక శాతం తగ్గించి, 40 శాతానికి పరిమితం చేయాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం భావిస్తున్నదని తెలుస్తున్నది. ఈ మేరకు ఆర్థికవేత్త అరవింద్ పనగరియా నేతృత్వంలోని ఆర్థిక సంఘానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించనుందని సమాచారం. ఈ ప్రతిపాదనకు ఆర్థిక సంఘం ఆమోదం తెలిపితే 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానుంది. అక్టోబరు 31 నాటికి ఆర్థిక సంఘం తన సిఫార్సులను వెల్లడించనుంది. ఇందులోనే ఈ నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

కేంద్రానికి అదనంగా 35 వేల కోట్లు

పన్ను వాటాను తగ్గించే నిర్ణయానికి మార్చి చివరి కల్లా మోదీ సారథ్యంలోని మంత్రివర్గం ఆమోదం తెలిపి, ఆర్థిక సంఘానికి సిఫార్సు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం ద్వారా కేంద్రానికి అదనంగా రూ.35 వేల కోట్ల ఆదాయం సమకూరనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని పన్ను వసూళ్లను బట్టి ఈ అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో పన్ను వసూళ్లు పెరిగే కొద్దీ ఈ మొత్తం మరింత పెరుగుతుంది. రాష్ట్రాలకు పన్ను వసూళ్లలో వాటాను తగ్గించడం ద్వారా ద్రవ్యలోటును పూడ్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నదని సమాచారం. 2024-25కు గానూ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో కేంద్రం ద్రవ్యలోటు 4.8 శాతంగా ఉంది. ఇదే సమయంలో రాష్ట్రాల ద్రవ్యలోటు దేశ జీడీపీలో 3.2 శాతంగానే ఉంది.

ఇప్పటికే సెస్సులతో రాష్ట్రాలకు నష్టం

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఇప్పటికే తమకు నష్టం వాటిల్లుతున్నదని రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా కొవిడ్-19 తర్వాత కేంద్రం సెస్సులు, సర్‌చార్జీలను భారీగా పెంచుతున్నది. వీటిల్లో రాష్ట్రాలకు వాటా దక్కదు. గతంలో మొత్తం పన్ను ఆదాయంలో సెస్సులు, సర్‌చార్జీల వాటా 9%-12% ఉండేది. ఇప్పుడు ఇది 15 శాతానికి పెరిగింది. మరోవైపు తమ ఆదాయం పెంచుకోవడంలో జీఎస్టీ సైతం అడ్డంకిగా మారిందని రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను తగ్గిస్తే రాష్ట్రాలకు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లపై ఆంక్షలు విధించడం ద్వారా రాష్ట్రాలు ఉచితాలు అమలు చేయకుండా నిరుత్సాహపరిచేందుకు సైతం కేంద్రం మార్గాలు అన్వేషిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే గత ఐదేండ్లుగా ద్రవ్యలోటు గ్రాంట్లు రూ.1.18 లక్షల కోట్లు(2021-22) నుంచి రూ.13,700 కోట్లకు(2025-26 అంచనా) తగ్గాయి.

100 కోట్ల మంది స్థోమత అంతంతే

- అదనపు ఖర్చు పెట్టేందుకు డబ్బుల్లేవ్
- కన్స్యూమింగ్ క్లాస్‌లో 13 కోట్ల మంది మాత్రమే
- సంపన్నుల వద్ద మరింత పెరుగుతున్న సంపద
- భారతీయుల ఆర్థిక స్థితిపై బ్లూమ్ వెంచర్స్ నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: దేశంలోని 143 కోట్ల జనాభాలో 100 కోట్ల మంది ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని బ్లూమ్ వెంచర్స్ అనే సంస్థ నివేదిక వెల్లడించింది. అవసరమైన వస్తువులను మించి ఇతర వస్తువుల కొనుగోలుకు డబ్బులు వెచ్చించగలిగే ఆదాయం వీరికి లేదని తెలిపింది. భారతీయుల ఆర్థిక స్థితిగతులపై ఈ సంస్థ అధ్యయనం చేసి నివేదిక విడుదల చేసింది. దేశంలో 13 కోట్ల మంది మాత్రమే 'కన్స్యూమింగ్ క్లాస్'లో ఉన్నారని తెలిపింది. కనీస అవసరాలకు మించి ఖర్చు చేయగలిగే ఆదాయం ఉన్నవారిని కన్స్యూమింగ్ క్లాస్‌గా పేర్కొన్నది. అంకుర సంస్థలకు ఎక్కువగా వీరే మార్కెట్‌గా ఉన్నారని వెల్లడించింది. దేశంలో 30 కోట్ల మందిని 'ఆశావహ' వినియోగదారులుగా ఈ నివేదిక పేర్కొన్నది. వీరు ఇప్పుడిప్పుడే అధికంగా ఖర్చు చేయడం ప్రారంభించారని, ఇందుకు డిజిటల్ పేమెంట్ల సదుపాయం దోహదపడుతుందని తెలిపింది. ఎక్కువగా ఓటీటీ, మీడియా, ఎడ్‌టెక్, రుణ సంస్థలకు వీరు వినియోగదారులుగా ఉన్నారని పేర్కొన్నది.

10 శాతం మంది వద్ద 57.7 శాతం ఆదాయం

భారతీయ వినియోగదారుల మార్కెట్ విస్తృతం కావడం లేదని, లోతుగా మారుతున్నదని ఈ నివేదిక ప్రధానంగా పేర్కొన్నది. అంటే, సంపన్నుల సంఖ్య పెరగడం లేదని, ఇప్పటికే ధనికులుగా ఉన్నవారు మరింత సంపన్నులు అవుతున్నారని వెల్లడించింది. ఎక్కువ జనాభా కోసం కాకుండా ధనికులకు విలాసవంతమైన వస్తువులు విక్రయించడంపై కంపెనీలు దృష్టి పెడుతున్నాయని, ఉదాహరణకు ఐదేండ్ల క్రితం 40 శాతంగా ఉన్న అందుబాటు ధరల్లోని గృహాల నిర్మాణం ఇప్పుడు 18 శాతమే ఉందని పేర్కొన్నది. 1990లో దేశంలోని మొదటి 10 శాతం సంపన్నుల వద్ద 34 శాతం జాతీయ ఆదాయం ఉంటే ఇప్పుడు అది 57.7 శాతానికి పెరిగిందని వెల్లడించింది. ఇదే సమయంలో ఆదాయంలో అట్టడుగున ఉన్న 50 శాతం మంది వాటా.. జాతీయ ఆదాయంలో 22.2 శాతం నుంచి 15 శాతానికి పడిపోయిందని పేర్కొన్నది.

ఐవీఎఫ్‌కు భర్త వయసుతో సంబంధం లేదు

భార్యను అనుమతించాల్సిందే

కేరళ హైకోర్టు కీలక తీర్పు

తిరువనంతపురం: భర్త నిర్దేశిత వయసును దాటినప్పటికీ దాత బీజకణంను ఉపయోగించి ఐవీఎఫ్ చేయించుకోవడానికి భార్య అర్హురాలేనని కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. సహాయ పునరుత్పత్తి సాంకేతికత(ఆర్ట్) చట్టం 2021 కింద నిర్దేశించిన 55 ఏండ్ల వయోపరిమితిని భర్త అధిగమించినప్పటికీ ఆమె ఐవీఎఫ్ చేయించుకోవచ్చునని, అయితే దానికి ఆమె భర్త సమ్మతిని తెలియజేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే 46 ఏండ్ల మహిళ, 57 ఏండ్ల ఆమె భర్త గతంలో సంతానం కోసం ఐవీఎఫ్ చికిత్స తీసుకుని విఫలమై మరోసారి ఆ విధానం ప్రయత్నిద్దామని ఒక హాస్పిటల్‌కు వెళ్లారు. అయితే భర్త వయసు 57 ఏండ్లు దాటినందున ఆర్ట్ చట్టం ప్రకారం వారు ఐవీఎఫ్ చికిత్సకు అనర్హులని తిరస్కరించారు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

అగ్నిపర్వతాలతోనే ఆక్సిజన్!

భూమిపై ప్రాణవాయువు ఏర్పాటులో కీలకపాత్ర

న్యూయార్క్: కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై పీల్చేందుకు ప్రాణవాయువు లభించేది కాదు. దీంతో జీవం మనుగడే ఉండేది కాదు. ఆ తర్వాత భూమిపై ఆక్సిజన్ ఉత్పత్తి ప్రారంభమైంది. అయితే, ఆక్సిజన్ ఉత్పత్తి ఎలా మొదలయ్యిందనే అంశం మాత్రం ఇంతకాలంగా అంతుచిక్కలేదు. ఈ ప్రశ్నకు ఒక అధ్యయనం సమాధానం కనుగొన్నది. ఆక్సిజన్ ఉత్పత్తికి అగ్నిపర్వతాలు దోహదపడ్డాయని తేల్చింది. కోట్ల ఏండ్ల క్రితం క్యానోబ్యాక్టీరియాతో ఏర్పడిన స్ట్రోమాటోలైట్స్ అనే రాతి నిర్మాణాలను శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. అప్పట్లో సముద్రాల్లో ఆక్సిజన్ చాలా తక్కువగా ఉండేదని, అగ్నిపర్వతాలు బద్దలైనప్పుడు వెలువడే నైట్రోజెన్ సహా ఇతర ఖనిజాలు, పోషకాలు సముద్రంలోకి చేరాయని, ఇవి సూక్ష్మజీవుల పెరుగుదలకు అనువైన వాతావరణాన్ని కల్పించాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. తద్వారా ఆక్సిజన్ ఉత్పత్తికి దోహదపడ్డ ఫోటోసింథేసిస్ ఏర్పడిందని తేల్చారు.

విదేశీ విద్యకు డబుల్ ట్రబుల్

- పడిపోతున్న రూపాయి విలువ
- కఠినమవుతున్న వీసా ఆంక్షలు
- చదువు పూర్తయ్యాక జాబ్ కష్టమే



ముంబై, ఫిబ్రవరి 27: విదేశాల్లో చదువుకోవాలనే కల నెరవేర్చుకోవడం రోజురోజుకూ కష్టంగా మారుతున్నది. ఒకవైపు పతనమవుతున్న రూపాయి విలువ, మరోవైపు కఠినమవుతున్న వీసా నిబంధనలతో విదేశాల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల కష్టాలు రెట్టింపవుతున్నాయి. చదువు పూర్తి చేసుకొని డాలర్లు సంపాదించడం దేవుడెరుగు.. చదువుకునేందుకు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కూడా కష్టమవుతున్నది. మరోవైపు విదేశాల్లో పిల్లల ఖర్చుల కోసం ఇక్కడి నుంచి డబ్బులు పంపే తల్లిదండ్రులపైనా భారం పెరుగుతున్నది.

రూపాయి పతనంతో పెరుగుతున్న భారం

డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ వేగంగా పడిపోతున్నది. దీంతో విదేశీ విద్యకు ఫీజులు, ఇతర ఖర్చులకు వెచ్చించాల్సిన విలువ మన కరెన్సీలో పెరిగిపోతున్నది. గత ఆరు నెలల్లో రూపాయి విలువ 5 శాతం పడిపోయింది. గత ఆగస్టులో 83.5 ఉన్న రూపాయి విలువ ఇప్పుడు 87.2కు పడిపోయింది. ఉదాహరణకు విదేశీ విద్య ఫీజులు, ఖర్చుల కోసం కోటి రూపాయలు ఖర్చయ్యే చోట ఇప్పుడు రూ.5 లక్షలు అధికం అవుతున్నది. దీంతో విద్యార్థులపై స్టడీ లోన్ల భారం పెరుగుతున్నది. పిల్లలకు డబ్బులు పంపే తల్లిదండ్రులదీ ఇదే పరిస్థితి. గతంలో అమెరికాలోని తన కూతురికి నెలకు 900 డాలర్లు పంపేదానినని, ఇప్పుడు 800 డాలర్లు మాత్రమే పంపగలుగుతున్నానని ముంబైకి చెందిన సుధా పై తెలిపారు.

వీసా నిబంధనలు కఠినం

చదువు పూర్తయ్యాక విదేశాల్లోనే ఉద్యోగాలు చూసుకొని రుణాన్ని చెల్లించడంతో పాటు నాలుగు డాలర్లు కూడబెట్టుకోవాలనేది భారతీయ విద్యార్థుల ఆలోచన. అయితే, ఇటీవల అమెరికా, యూకే, కెనడా వంటి దేశాలు వీసా నిబంధనలను కఠినతరం చేశాయి. దీంతో చదువు పూర్తయ్యాక ఉద్యోగాలు పొందడం కష్టంగా మారుతున్నది. విదేశీ గ్రాడ్యుయేట్లు యూకేలో రెండేండ్లు అదనంగా నివసించాలంటే 36-40 వేల పౌండ్ల నడుమ వేతనాలు ఉండే ఉద్యోగాలు పొందాలని యూకే కొత్త నిబంధన తెస్తున్నది. భారతీయ విద్యార్థులకు కెనడా ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కఠినతరం చేస్తున్నది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమెరికాలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరకకపోయినా, వీసా నిబంధనల వల్ల పని చేయడం కుదరకపోయినా విద్యార్థులు ఆర్థికంగా మరింత కష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

విద్యార్థులకు నిపుణుల సలహాలు

- స్టడీ లోన్లు ఒకేసారి తీసుకొని యూనివర్సిటీలకు చెల్లించడం ద్వారా రూపాయి విలువ తగ్గినా తల్లిదండ్రులపై ప్రభావం పడదు.
- విద్యార్థులు విదేశీ కరెన్సీలో లోన్లు తీసుకోవద్దు. భారత్‌కు తిరిగొచ్చేటప్పుడు ఇవి చెల్లించడం కష్టమవుతుంది.
- స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయం అందించే యూనివర్సిటీల్లో సీట్లు పొందేందుకు ప్రయత్నించాలి.
- సాంప్రదాయ కోర్సులు కాకుండా జెన్‌ఏఐ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చెయిన్ వంటి సరికొత్త కోర్సులు చేస్తే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.
- ఉద్యోగాలు పొందేందుకు కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలే కాకుండా కొత్త సాంకేతికతలపై నైపుణ్యాలు పొందాలి.

దారుణంగా ఉన్న రోడ్లకు టోల్ ఎందుకు కట్టాలి?

- ఎన్‌హెచ్-44పై 80% టోల్ తగ్గింపు
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు ఆదేశం

శ్రీనగర్, ఫిబ్రవరి 27: సక్రమంగా నిర్వహించని జాతీయ రహదారులపై(ఎన్‌హెచ్) ప్రయాణించే వాహనదారుల నుంచి టోల్ ట్యాక్సులు వసూలు చేయడం న్యాయం కాదని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ప్రభావం చూపించే విధంగా ఎన్‌హెచ్‌లపై టోల్ వసూళ్ల బాదుడుకు సంబంధించి హైకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్‌హెచ్-44పై దారుణంగా రోడ్లు ఉన్న సెక్షన్‌లో టోల్ వసూళ్లను 80 శాతం తగ్గించాలని భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)ని హైకోర్టు ఆదేశించింది. రోడ్లు దయనీయంగా ఉన్న హైవేలో టోల్ ఫీజులు వసూలు చేయకూడదని హైకోర్టు స్పష్టం చేసింది. పఠాన్‌కోట్-ఉధంపూర్ సెక్షన్‌కు సంబంధించి దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ తాషీ రబ్‌స్తాన్, జస్టిస్ ఎంఏ చౌదరితో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది.

ఇడ్లీల్లో ప్లాస్టిక్ ఆనవాళ్లు !

- కర్ణాటకలోని పలు హోటళ్లలో గుర్తించిన అధికారులు
- వస్త్రానికి బదులు పాలిథీన్ షీట్లు వాడటమే కారణం
- ఇడ్లీ తయారీకి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించిన ప్రభుత్వం

బెంగళూరు, ఫిబ్రవరి 27: దక్షిణ భారతీయులు ఇష్టంగా తినే ఇడ్లీల్లో ప్లాస్టిక్ ఆనవాళ్లు ఉండటం కర్ణాటకలో కలకలం రేపింది. హోటళ్లలో ఇడ్లీలను తయారు చేసేటప్పుడు పాత్రలపై వస్త్రాన్ని కప్పి, దానిపై పిండి వేస్తారు. అయితే, కర్ణాటకలోని పలు హోటళ్లలో వస్త్రానికి బదులు పాలిథీన్ షీట్లు వినియోగిస్తున్నారని ఇటీవల ప్రభుత్వానికి సమాచారం అందింది. దీంతో ఆహార భద్రత శాఖ అధికారులు రాష్ట్రంలో 251 హోటళ్లపై దాడులు చేసి నమూనాలు సేకరించారు. వీటిని పరీక్షించగా 52 హోటళ్లలో ఇడ్లీల తయారీకి ప్లాస్టిక్ వినియోగించినట్టు గుర్తించారు. ప్లాస్టిక్‌లో ఉండే క్యాన్సర్ కారకాలు ఇడ్లీల ద్వారా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇడ్లీల తయారీకి ఎక్కడా పాలిథీన్ షీట్లు వాడొద్దని నిషేధం విధించింది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు గురువారం ప్రకటించారు.

ఇడ్లీ-సాంబార్ వల్లే పర్యాటకులు తగ్గారు!

గోవా బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు

పనాజీ,ఫిబ్రవరి 27: గోవాలో పర్యాటకుల తగ్గిపోవడానికి బీచ్ షాపులలో ఇడ్లీ-సాంబార్ అమ్మడమే కారణమని బీజేపీ ఎమ్మెల్యే మైఖేల్ లోబో గురువారం వ్యాఖ్యానించారు. గోవా రాష్ట్రాన్ని సందర్శించే విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గిపోవడానికి ప్రభుత్వాన్ని మాత్రమే నిందించడం తగదని, ఇందుకు సంబంధిత భాగస్వాములందరూ సమానంగా బాధ్యులని చెప్పారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు తమ బీచ్ దుకాణాలను గోవా ప్రజలు అద్దెకు ఇచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బెంగళూరుకు చెందిన వ్యక్తులు కొందరు తమ షాపులలో వడా-పావ్ అమ్ముతున్నారని, కొందరు ఇడ్లీ-సాంబార్ అమ్ముతున్నారని, ఈ కారణంగానే రెండేళ్లుగా అంతర్జాతీయ పర్యాటకం తగ్గిపోయిందని ఆరోపించారు. యుద్ధం కారణంగా రష్యా, ఉక్రెయిన్ పర్యాటకులు గోవాకు రావడం ఆగిపోయిందనిఅన్నారు. పూర్వ యూఎస్ఎస్ఆర్ దేశాల నుంచి పర్యాటకులు గోవాను సందర్శించడం మానుకున్నారని చెప్పారు.

గోల్డ్ కార్డుతో భారతీయులకు ఉద్యోగాలు

అమెరికన్ సంస్థలు నిపుణులైన పట్టభద్రులను నియమించుకునే అవకాశం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్ డీసీ, ఫిబ్రవరి 27: కొత్తగా తీసుకువస్తున్న గోల్డ్ కార్డుల ద్వారా అమెరికన్ కంపెనీలు ప్రతిభావంతులైన భారతీయ పట్టభద్రులను నియమించుకునే అవకాశం ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్